
# మంత్రనగరి

పి:సత్యవతి



ప్రస్తుతం నేను శిథిలాలలో శిల్పాల కోసం అన్వేషిస్తున్నాను.

తెగ నరికిన మహావృక్షాల క్రింద వేరు మొక్కలు మొలవకపోతాయా అని ఆశగా గొప్పులు తవ్వి నీళ్ళు పెడుతున్నారు. నా కూతురు గీతకి యిదంతా సమయాన్ని వృధా చెయ్యడం క్రింద లెక్క. తనెప్పుడూ సమయం వృధా చెయ్యదు. చదువుకునే రోజుల్లో విద్యార్థి సంఘాల కోసం, తరువాత స్త్రీల హక్కులు, మానవ హక్కుల సంఘాల కోసం చాలా కృషి చేసేది.

ఇప్పుడూ ఆమె సమయం వృధాచెయ్యడం లేదు. ఇల్లు శుభ్రంగా అందంగా వుంచుకుంటూ- శరీరాన్ని లావు కాకుండా కాపాడుకుంటూ, డబ్బుని ఎట్లా 'ఇన్వెస్ట్' చెయ్యాలో ఆలోచిస్తూ- ఉద్యోగాన్ని కాపాడుకుంటూ చాలా బిజీగానేవుంది. తన 'వెల్ సెటిల్డ్' జీవితాన్ని కళ్ళారా చూసి పొమ్మని పోట్లాడుతూంటే నేనూ ఒకసారి ఈ 'అవకాశాల దేశాన్ని' చూడ్డానికొచ్చాను. మరి తనింటికి వచ్చినప్పుడు తనతో పాటు పేరంటాలకీ, పార్టీలకీ వెళ్ళక తప్పదు కదా! అట్లా వచ్చాం రాధా చింతగింజల గృహప్రవేశం, సత్యనారాయణ వ్రతమహోత్సవానికి.

నిన్న సాయంత్రం సాదా సీదాగా వాల్‌మార్ట్‌లో కనిపించిన చింతగింజల ఇవ్వాళ అలంకారం చేసిన శుక్రవారం శ్రీమహాలక్ష్మిలా, వజ్రవైఢూర్యాలతో వెలిగిపోతోంది.

రమేష్ చింతగింజల కూడా పట్టు పీతాంబరాలతో, మెడలో లావు గొలుసుతో, ఎలక్షన్‌లో గెలిచి వెంకటేశ్వర స్వామికి కళ్యాణం చేయించడానికొచ్చిన కొత్త ఎం.ఎల్.ఎలా వున్నాడు. బేబీ చింతగింజల ఏం తీసిపోలేదు. నాగరం జడకుప్పెలు వంకీ వడ్రాణాలతో పట్టు పావడాతో బాలా త్రిపురా సుందరిలా వుంది. చుట్టూ చాలా పెద్ద ల్యాండ్‌స్కేప్‌లో ఉన్న ఆ నాలుగు పడక గదుల "సింగిల్ ఫ్యామిలీ హౌస్"ని దేశవిదేశాల హస్తకళలతో అలంకరించింది రాధ చింతగింజల. హాలులో సత్యనారాయణ వ్రతం జరుగుతుంటే లివింగ్‌రూంలో సోఫాల మీత గీత స్నేహ బృందంతోపాటు నేనూ కూర్చున్నాను. వాళ్ళు రియల్ ఎస్టేట్, స్టాక్ మార్కెట్, లే ఆఫ్‌లు, ఇండియాలో కొని తెచ్చుకోవాల్సిన వస్తువులు, హైదరాబాద్‌లో ఎన్నారైల కోసం పెట్టిన షాపులు, పిల్లలకి నేర్పించవలసిన భారతీయ కళలు- వీటి గురించి మాట్లాడుకుంటుంటే వింటున్నాను. అంతలో అక్కడికి, పిల్లలకి హాయిగా అమెరికా సంబంధాలు చేసేసి పురుళ్లు పోయ్యాడానికి వచ్చిన తల్లులు, పుట్టిన పిల్లల్ని 'బేబి సిట్టింగ్' చేసి పెట్టడానికొచ్చిన తల్లులు కొంత మంది వచ్చారు. చాలా మందికి అమ్మాయిలు ఇంటర్మీడియట్‌లోకి రాగానే, కలల్లోకి పిట్స్‌బర్గ్ వెంకటేశ్వరుడు, నయాగరా జలపాతం వస్తాయట!

అవునూ శ్రీ విద్య కనపడదేమిటి? శ్రీనివాస్‌ని వెతూక్కుంటు పోయిందా ఏమో! పాపం పూర్‌గళ్

*** ***

ఇక్కడే వున్నాను. ఇంకా శ్రీనివాస్‌తో నాకేం పని! నా ఉద్యోగం పోయాక అతను ఇటుకేసి రావడమే మానుకున్నాడు కదా! పైగా గ్రీన్‌కార్డ్ వచ్చాక నాలాంటి వాళ్ళు కనపడతారా! యాటిట్యూడే మారిపోయింది అబ్బాయికి. ఒకప్పుడు శ్రావణిని చూడగానే 'అందమున కోతిపిల్ల' అని పాడేవాడు- ఇప్పుడా పిల్లకి అమెరికన్ కంపెనీలో ఉద్యోగం రాగానే వీకెండ్స్‌నీ ఆ పిల్ల అపార్ట్‌మెంట్‌లోనే. శ్రీనివాస్ కాకపోతే ఇంకో సుబ్బారావు! అమ్మా వాళ్ళెటూ అమెరికా సంబంధాలకోసం వెతుకుతూనే వున్నారు. కాకపోతే తెలిసిన వాడైతే బావుంటుంది కదా అని చూస్తున్నాను. ఇక్కడ కూడా జీన్స్ టీషర్ట్‌లు ధరించిన మనువులు వున్నారు. ఉదాహరణకి జ్యోతి మొగుణ్ణి తీసుకో! ఆ పిల్లని ఎట్లా కాల్చుకు తింటాండో! అవును జ్యోతి కూడా రావాలే ఇక్కడికి.

> సత్యనారాయణవ్రతం, అరిసెలు బొబ్బట్లు, ఉలవచారు మీగడలతో భోజనం, తాంబూలంతోపాటు వెండిగిన్నె ప్రదానం అన్నీ లక్షణంగా జరిగిపోయాయి

*** ***

ఎందుకు రానూ- వచ్చినట్లు వస్తాను. రాధ చింతగింజల కంపెనీలోనేగా ఈయన పని చేసేది. పైగా అంతా తెలుగు వాళ్ళం- రాకపోతే వూరుకుంటాడా! ఇదుగో రెండేళ్ళకే నాలుగేళ్ళ పిల్లలా తయారైన నా కూతురు భూతాన్ని, డైపర్ బ్యాగ్‌నీ, పొట్టలో ఆర్నెల్ల పిల్లనీ మోసుకుంటూ మరీ వచ్చాను. నా మొగుడు మహారాజుకి అమెరికాలో డాలర్లు తప్ప ఇంకేం కనిపించవు. ఇంటిపని పంచుకునే గీత వాళ్ళాయన లాంటి వాళ్ళు - పిల్లల్ని ఆడవాళ్ళతో సమానంగా పెంచే మొగవాళ్ళు- అమెరికా రాగానే కారు డ్రైవింగ్ నేర్పించే మొగుళ్ళు వీళ్ళెవరూ కనిపించరు. కనీసం ఇంగ్లీషయినా ధారళంగా మాట్లాడం నేర్పించాండా? ఎంతసేపటికీ పెరుగు వడలొండుతావా! చిల్లీ చికెన్ చేస్తావా! పిల్లని ఏడవకుండా ఆడించు నేను నిద్రపోవాలి! ఇలాగ. పోనీ పురుటికైనా అమ్మ దగ్గరకి పోదామంటే పిల్లల్ని ఇక్కడే కనాలిట. వాళ్ళు అమెరికన్ సిటిజన్స్ అవుతారట. ఏం సిటిజన్స్ ఏమో! ఇరవై లక్షలు ధారపోసి ఈయనకి అంటగట్టాడు మా నాన్న - తోటివాళ్ళల్లో గొప్ప కోసం. ఇంతకీ నేను చేసిన తప్పేమిటి! మా ప్రక్కింటి రాజాతో సినిమాకి పోవడం- ఆ మాత్రానికే ఇంటర్‌లో చదువు మాన్పించేసి పద్దెనిమిది రాకుండానే ఇట్లా తోలేశాడు. ఇంకా ఇప్పుడు కూడా 'విధి' అని 'కర్మ' అనీ తిట్టుకోడం తప్పట్లేదు మరి! నాలాంటి చేతగాని వాళ్ళకి!

*** ***

సత్యనారాయణవ్రతం, అరిసెలు బొబ్బట్లు, ఉలవచారు మీగడలతో భోజనం, తాంబూలంతోపాటు వెండిగిన్నె ప్రదానం అన్నీ లక్షణంగా జరిగిపోయాయి- ఇండియాలో ఎవరూ లక్ష వత్తుల నోము చేస్తున్నట్టు లేరు-అది కూడా ఇక్కడే చూసే భాగ్యం కలుగుతుందేమో. మొన్న రమణీ పాములూరి ఇంట్లో స్వామి వారొకరు యజ్ఞం జరిపించారు. ఆవిడ కూడా ఇట్లాగే అందరికీ వెండిగిన్నె జ్ఞాపికలు యిచ్చింది.

ఆల్ ఈజ్ వెల్ విత్ ద వరల్డ్. సత్యనారాయణ

స్వామీ ఈజ్ హియర్.

హెవీ లంచ్ కదా. ఇంక డిన్నర్ వండే తినే పనే లేదు. ఆకలి వేస్తే ఫ్రిజ్ నిండా చాలా 'లెఫ్ట్ ఓవర్'లు వున్నాయి. ఎవరికి కావల్సింది వాళ్ళు వెచ్చబెట్టుకొని తినొచ్చు.

గీతకి వారాంతపు పనులు చాలా వుంటాయి- తనకీ తన కూతురికీ హెయిర్‌కట్, లాండ్రీ, ప్రెస్సింగ్, వ్యాక్యూమింగ్- తనూ అతనూ కలిసి కుస్తీ పడుతుంటారు. మనకెందుకు- మన రూంలో కూర్చుని పుస్తకం చదువుకోవచ్చు హాయిగా.

*** ***

ఏమీ తోచడం లేదు. ఉద్యోగం పోయిందగ్గర్నుంచీ. ఎంతసేపు బ్రౌసింగ్, ఛాటింగ్ చేస్తాం. ఛాటింగ్‌లో ఒకతను చాలా ఇంట్రెస్టింగ్‌గా కనిపిస్తున్నాడు. చూడాలి- గీతక్క మంచిది- వీసా ఇంకో నెల వుంది కదా- తనింట్లో వుండి ఉద్యోగం వెతుక్కోమంది. ఈలోగా రూన్సీ పిన్ని కూడా వచ్చింది. గీత మా రూన్సీ పిన్ని కూతురు. రూన్సీ పిన్ని చాలా సరదాగా వుంటుంది. మంచికథలు చెబుతుంది. పుస్తకం చదువుకుంటోంది. ఆవిడ్నిప్పుడు అర్జెంటుగా డిస్టర్బ్ చేయాలి- కథచెప్పమని.

*** ***

ఏమ్మా శ్రీవిద్యా! కథ చెప్పాలా? చివరిదాకా వింటానంటే చెబుతా మరి.

అనగనగా ఒక ఊరు- ఊళ్ళో ఒక ఇల్లు. ఇంట్లో ఒక కుటుంబం. ఇల్లంతా చీకటి. ఒక్క కిటికీ కూడా లేదు- ఆ ఊళ్ళో. ఆ ఇంట్లో. ఆ కుటుంబంలో ఓ అమ్మాయి పుట్టింది. అమ్మాయికి వాళ్ళమ్మ 'అనసూయ' అని పేరు పెట్టింది. ఆ పిల్ల పుట్టగానే అందరి శిశువుల్లాగే గొంతెత్తి ఏడ్చింది. తరువాతెందుకో గొంతు కీచుపోయింది. అంతేకాదు- ఆ పిల్ల పొడుగు పెరగడం కూడా లేదు. ఏడేళ్ళొచ్చినా రెండడుగులకన్న పెరగలేదు. తల ఎప్పుడూ వాలి వుండేది. ఎత్తడానికి ప్రయత్నించేదికాదు- ఎత్తితే నెప్పి అనేది. వంగే వుండిపోయింది. మాటలూ సరిగ్గా రాలేదు. కొంతమందితో మాట్లాడ్డానికి ప్రయత్నించేది. కొంతమందిని చూసి మూగబోయేది. అమ్మతో మాట్లాడేది. నాన్నని చూస్తే గొంతువచ్చేదికాదు. అన్నయ్యల్ని చూసినా అంతే. వాళ్ళిల్లంతా చీకటిని చెప్పాకదూ! కానీ ఆ ఇంట్లో వాళ్ళ తాతగారి భోషాణంవున్న గదిలో మాత్రం గోడకి చిన్న కంత వుండేది. మధ్యాహ్నం వేళ ఆ కంతలోనుంచీ గుండ్రంగా వెలుగు భోషాణం మీద పడేది. అనసూయకి ఆ వెలుగు మడుగూ, దాని వెచ్చదనం చాలా యిష్టం- అందుకని సరిగ్గా ఆ సమయానికి వెళ్ళి భోషాణం మీద పడుకునేది. ఆ వెలుగు వలయం తన పొట్టమీద పడేలాగ. కళ్ళ మీద వెలుగుపడితే అనసూయ భరించలేదు. ఎందుకంటే ఆమె ఇంటి బయటికెప్పుడూ పోలేదు. ఆ ఇంటి ఆడప్రాణులేవీ గుమ్మం దాటకూడదు. చిన్నప్రాణులైనా సరే. తెల్లవారు ఝామునే



కాలకృత్యాలు తీర్చుకోవాలి- ముగ్గులు వేసుకోవాలి- పూలు విచ్చకముందే కోసుకోవాలి- అది ఆ ఇంటి సంప్రదాయం.

ఎనిమిదో ఏట అనసూయకి పెళ్ళైంది. అనసూయకి పెళ్ళికొడుకు పాదాలు మాత్రం కనపడ్డాయి. వాటికి దణ్ణాలు పెట్టిస్తారుకదా! పెద్ద మనిషయ్యాక పధ్నాలుగో ఏట అత్తవారింటికి వచ్చింది.

ఆ ఇల్లు కూడా పుట్టింటిలాంటిదే. అక్కడ కూడా ఒకేఒక్క గది గోడకి చిన్న కంత వుంది. అందులోనుంచి వెలుగు నేలమీద పడేది కాసేపు. అప్పుడు గబగబ పరిగెత్తుకువెళ్ళి అక్కడ చాపమీద పడుకునేది, మళ్ళీ ఆ వెలుగు తన పొట్టమీద పడేలాగ. అనసూయ పొట్టకి తప్ప మరే అవయవానికి వెచ్చదనమూ. వెలుగూ పడవు- ఆమె పొట్టితనం, మూగతనం, తలవంగినతనం ఏవీకూడా సంతాన సాఫల్యానికి అడ్డంకాలేదు. తొమ్మిదిమంది పిల్లలు పుట్టారు. నలుగురు బతికారు. అందులో ముగ్గురు మగపిల్లలు. చివరిది ఆడపిల్ల. తన కూతురు తనలా మరుగుజ్జు కాకూడదనీ- దాని తల తనకిలాగ వంగిపోకూడదనీ- దానికి బాగా ఖంగుమని మాటలు రావాలనీ,రోజూ దేవుళ్ళందరికీ మొక్కుకునేది. ఏళ్ళు వస్తున్నకొద్దీ ఆ పిల్ల పెరుగుతోందా లేదా అని తన జానలతో కొలుస్తూ వుండేది. ఆమెకి కృష్ణవేణి అని పేరుపెట్టింది అనసూయ అత్త సుమతి.

**తన చెమట ఎర్రగా వుండడానికి కారణం కుంకుమేమో అనుకునేదిగానీ చెమటతోపాటు ఎర్రరక్తకణాలు కూడా వస్తున్నాయని తెలీలేదు. అవి చెమటలో కరిగి వస్తాయని తనకేం తెలుసు. తెలిస్తే మాత్రం తనేం చేయగలదు**

ఏడాది వెళ్ళగానే బుడిబుడి నడకలతో కృష్ణవేణి బయటికి వెళ్ళడానికి ప్రయత్నించేది. ఎప్పుడూ ఎండలో వెలుగులో వుండడానికి యిష్టపడేది. రెండేళ్ళ పిల్లయినా ఇరవై రెండేళ్ళ యువతైనా అరవై రెండేళ్ళ వృద్ధురాలైనా సరే గుమ్మం దాటడం ఆ ఇంటి సంప్రదాయం కాదుగనుక భర్త ఆ చిన్నపిల్లని కొడతాడేమోనని హడలిపోయేది అనసూయ. అయిదేళ్ళకి తనకన్న పొడుగైన కూతుర్ని చూస్తే అనసూయకి ఆనందం. కూతురు ముఖం కనపడకపోయినా సరే. బళ్ళో చేరతానని తండ్రితో పోట్లాడి పలకా బలపం కొనుక్కుంది కృష్ణవేణి తన అన్నల్లాగ. ఆ పలకన్నా బలపం అన్నా అనసూయకి చాలా యిష్టం. ఎప్పుడూ కూతురు పలకని గుండెకానించుకుని ముద్దులు కుమ్మరించేది. తనింతవరకూ భర్త ఎదురుగా నిలబడి మాట్లాడిఎరుగదు. అతన్ని చూస్తే ఆమెకి వెన్నులోనుంచీ వణుకు. నడుం వంగిపోతుంది. మనిషే కుప్పకూలిపోతుంది. ఈ మధ్యన అనసూయ వళ్ళంతా తెల్లగా పాలిపోయింది. తలతోపాటు నడుం కూడా పైకి లేవడంలేదు. పిండితో చేసిన బొమ్మలా తయారైంది. ఆమెకి సూర్యరశ్మి తగలకపోవడమే జబ్బుకి కారణం కావచ్చునీ, ఇంటికి ఒక కిటికీ పెట్టించి, దాని దగ్గర మంచం వేయమనీ చెప్పాడు వైద్యుడు. అనసూయ అట్లా మంచం పట్టేనాటికి కృష్ణవేణికి పన్నెండేళ్ళొచ్చాయి. ఏడవ తరగతిలోకి వచ్చింది. అనసూయ రక్తంలో ఒక ఎర్రకణం కూడాలేదని చెప్పాడు వైద్యుడు. అనసూయకి కొంచెం అర్థం అయింది. రోజూ సాయంత్రం చాలా అలసిపోయి పెరట్లో చల్లగాలికి మంచం వేయించుకుని పడుకుని, నుదుటికి పట్టిన చెమట తుడుచుకుంటే పమిటకొంగు ఎర్రబడేది. తన చెమట ఎర్రగా వుండడానికి కారణం కుంకుమేమో అనుకునేదిగానీ చెమటతోపాటు ఎర్రరక్తకణాలు కూడా వస్తున్నాయని తెలీలేదు. అవి చెమటలో కరిగి వస్తాయని తనకేం తెలుసు. తెలిస్తే మాత్రం తనేం చేయగలదు.

భార్య జబ్బు అనసూయ భర్తకేం యిబ్బంది పెట్టలేదు. అప్పటికే అతని పెద్ద కొడుక్కి పెళ్ళై కోడలు వంట యింట్లోకి వచ్చింది. ఏనాడో భర్తని పోగొట్టుకుని పుట్టిల్లు చేరిన అతని చెల్లెలు సావడిలో వుండి గొడ్డుగోదా చూసుకుంటోంది. శరీర చాపల్యాలకి భార్య ఒక్కతే కావాలని నిబంధన ఏం లేదుగదా! కానీ అతన్ని యిబ్బంది పెడుతోందల్లా కూతురు కృష్ణవేణి ప్రవర్తనే. తన భార్య అనసూయ మరుగుజ్జు, అనాకారి అయినా వినయ విధేయతలు కలది. పొట్టిదైనా ఇంటెడు చాకిరీ వంచిన తలతోనే చేసేది. తన పాదాలవైపు చూస్తూ ఏదో గొణుగుతూ వుండేది. అది నోరు విప్పకపోతేనేం, దానికి కావల్సిన చీరెలు, నగలూ నట్రా అన్నీ యిచ్చేవాడేకదా! కృష్ణవేణికి తల్లి పోలిక రాలేదు. తాటిచెట్టులా ఎదిగింది. మొహంలో మొహంపెట్టి గంట కొట్టినట్లు మాట్లాడుతుంది. చదువు మాన్పించేస్తే సగం పొగరు

అణుగుతుందన్న సలహా మేరకు ఆ పని చేశాడు.

ఒకనాడు ప్రొద్దున్నే, అనసూయ కళ్ళు మూసుకుని కూతురు పలకని గుండెమీద పెట్టుకుని పడుకుంది. అతనేమో బయటికి బయల్దేరాడు. కృష్ణవేణి ఎదురుగా వచ్చి "నన్ను బడి ఎందుకు మాన్పించావ్ నాన్నా? నేను వెడతాను ఇవ్వాళ్టినించీ- ఇంట్లో ఏం తోచడంలేదు" అన్నది, తన కళ్ళల్లోకి చూస్తూ-అతనికెందుకో వెన్ను జలదరించింది. వెంటనే కోపం తెచ్చేసుకుని ఆమె మెడమీద సాచి ఒక్క దెబ్బ వేశాడు. వెంటనే కృష్ణవేణి తల ఆమె తల్లి తలలాగ వంగిపోయింది.

దెబ్బ శబ్దానికి కళ్ళు తెరిచిన అనసూయ కూతురు తలవాలిపోవడం చూసి భయంతో కళ్ళు మూసుకుంది. ఆమె ఆ కళ్ళు మరి తెరవనేలేదు. గుండెమీద రెండుచేతుల్లో బిగుసుకుపోయిన పలకతోసహా ఆమెకి అంత్యక్రియలు జరిగాయి.

కృష్ణవేణికి తల వంచుకోవడం చాలా కష్టంగా,అవమానంగా వుంది. అందుకని తల ఎత్తడానికి ఎప్పుడూ ప్రయత్నిస్తూ వుండేది. ఎత్తినప్పుడు గిలగిలలాడే నెప్పితో మళ్ళీ దించుకునేది. అట్లా తలఎత్తుతూ దించుతూ వుండడం ఒక అలవాటు కిందా, చూసిన వాళ్ళు అదొక జబ్బు అనుకునేలా మారిపోయింది.

మరో రెండేళ్ళకి కృష్ణవేణికి గిరీశంతో వివాహం అయింది. అతను పట్నంలో చిన్న ఉద్యోగం చేస్తాడు. చదువుకున్న అమ్మాయి కావాలని వెతికి వెతికీ కృష్ణవేణిని సంపాదించాడు.


అస్తమానం తల ఎత్తుతూ దించుతూ వుంటే తన కూతుర్ని ఎవరూ చేసుకోరేమోనని దిగులుపడ్డ తండ్రి, కృష్ణవేణికన్న పన్నెండేళ్ళు పెద్దవాడైనా సరేనని గిరీశానికిచ్చి చేసేశాడు కృష్ణవేణిని.

కృష్ణవేణి అలవాటుని మొదటి రోజే గమనించిన గిరీశం ఆమె మెడ అట్లా పైకీ కిందకీ రాకుండా ఒక లెవల్లో ఎట్లా 'ఫిక్స్' చేయాలా అని ఆలోచించాడు. ఆమె కాపురానికి రాగానే ఒక మంచి మర మేకు తెచ్చి ఆమె మెడమీద కొట్టేడు. దాంతో ఆమె అటు తన పాదాల్నీ కాకుండా, ఇటు తన కళ్ళనీ కాకుండా తన నోటినీ మీసాల్ని మాత్రమే చూడగలుగుతుందన్నమాట. మేకు కొట్టించుకుని బాధతో ఏడుస్తున్న భార్యకి, దాన్ని మరిపించడానికి ఓ డజను దారం వుండలూ, ఒక క్రోషియా సూదీ, కొన్ని ముగ్గుల పుస్తకాల, డిజైన్ల పుస్తకాలూ కొని తెచ్చాడు. ఒక చిన్న రేడియో కూడా కొనిచ్చాడు. దిండుగలీబుల మీద డిజైన్లు కుడుతూ, గుమ్మాలకి తెరలు అల్లుతూ, ధనుర్మాసంలో రకరకాల ముగ్గులు వేస్తూ బాధని మర్చిపోయేది కృష్ణవేణి. కానీ బాధ బాధేకదా!

తనకి కూతురు పుడితే దానిమెడ మీద కూడా ఈ దుష్టుడు మేకు దిగ్గొడతాడేమోనని హడలిపోయేది. అతను ఆఫీసుకు వెళ్ళినప్పుడు తెలుగు వార్తాపత్రిక చదవడం, రేడియోలో వార్తలు వినడం అలవాటయింది. దేశంలో ఏం జరుగుతోందో అర్థం అయింది. ఒకరోజు అతను పండక్కి కొనుక్కొచ్చి యిచ్చిన సిల్కు చీరె కాల్చి, దెబ్బలు తిన్నది. ఇంకోసారి ఇంటి ఖర్చుకి ఇచ్చిన డబ్బు మిగిల్చి పెట్టె రాట్నం కొన్నది. మరోసారి తన మేనత్త ఒకావిడ గాంధీగారికి నగలివ్వడానికి వెడుతుంటే తనవీ తీసిచ్చి,యిచ్చిరమ్మంది. అట్లా దెబ్బలు తింటూ, తిట్లు తింటూ, తెరలల్లుతూ, వున్న కృష్ణవేణికి కూతురు పుట్టింది. ఆ పిల్లకి తన తల్లిపేరు పెడతానని గిరీశం, కాదు ఝాన్సీలక్ష్మి అని పెట్టాలని కృష్ణవేణీ పోట్లాడుకుని తిట్టుకుని చివరికి అతను తన తల్లి పేరుతో పిలవడం ఈమె ఝాన్సీ పేరుతో పిలవడం చేస్తూవుండగా, స్కూల్లో చేరడానికి వెళ్ళినప్పుడు తన పేరు ఝాన్సీయేనని ఆ పిల్ల చెప్పడం హెడ్మాస్టర్ కూడా ఆ పేరే బావుందనడంతో ఝాన్సీ పేరు స్థిరపడిపోయింది. అది కృష్ణవేణి తన తొలి విజయంకింద భావించింది. అప్పటినించీ ఝాన్సీని పెంచే విషయం ఒక పెద్ద పోరాటం అయిపోయింది కృష్ణవేణికి. ఝాన్సీలక్ష్మి పొడవుగా బలంగా పెరుగుతోంది.తండ్రీకూతుళ్ళు ఎదురుపడి వాదనలకి దిగకుండా కాపాడడం కృష్ణవేణికి కత్తిమీద సాము.

నా శరీరం, నా మనస్సు, నా ఆలోచన, నా స్పందన- అనుభూతి- ఇవన్నీ నా స్వంతం అంటుంది. నా బతుకు తీర్చిదిద్దుకునే స్వతంత్రం, స్వేచ్ఛ నావి అంటుంది. అట్లా పెరిగి పెద్దదైన ఝాన్సీ కృష్ణవేణిని తీసుకువెళ్ళి డాక్టర్ చేత మెడమీద మేకు తీయించివేసింది

కృష్ణవేణి వూరునుంచీ రాంబాబు అనే అతనొచ్చాడు ఒక సాయంత్రం. చాలా అలసిపోయి వున్నాడు. జ్వరం కూడా వున్నట్లుంది. తన కోసం పోలీసులు వెతుకుతున్నారని-ఆ ఒక్కరాత్రి తనని దాచిపెట్టమనీ అడిగాడు. అతను కమ్యూనిస్టు అని కృష్ణవేణికి తెలుసు. కమ్యూనిస్టులంటే గిరీశంకి వొళ్ళుమంట అని తెలుసు. అతన్ని



దాచిపెడితే పోలీసులకి ఆ సంగతి తెలిస్తే తనకీ ప్రమాదమేనని తెలుసు. అయినా అతన్ని తనకి తెలిసిన ఒకావిడ ఇంట్లో రెండురోజులు వుంచి మందూమాకూ యిప్పించింది. తరువాత ఆ సంగతి తెలిసిన గిరీశం ఆమెని పుట్టింటికి పంపించి మరి రావద్దని చెప్పాడు. మళ్ళీ కృష్ణవేణి అన్న ఒకతను తీసుకొచ్చి చెల్లెలు భర్తకి వెయ్యి క్షమాపణలు చెప్పి దించి వెళ్ళాడు. తరువాత కృష్ణవేణి మరెన్నడూ రాజకీయాల జోలికి పోలేదు. తన కూతుర్ని మలుచుకోవడమే జీవిత ధ్యేయంగా పెట్టుకుంది.

పెద్దదౌతున్నకొద్దీ ఝాన్సీకి తండ్రికీ ప్రతిరోజూ యుద్ధమే. "ఆడపిల్లలాగ వుండమంటాడు" అతను.

"ఆడపిల్లలాగ వుండడం అంటే ఏమిటి? అసలు ఆడపిల్ల అలావుండాలని ఎవరుచెప్పారు? ఆడలక్షణాలంటూ ఏం వుండవు. అవన్నీ నువ్వు నా మీద రుద్దుతున్నావంతే-నేను అమ్మమ్మకాను, అమ్మనీ కాను"అనేది ఝాన్సీ. ఆమె మెడ మీద తండ్రి మేకు కొట్టకుండా తను కాపలా కాయవలసిన అవసరం లేదనీ, ఝాన్సీయే తనని తను కాపాడుకోగలదనీ అర్థం అయిన తరువాత కృష్ణవేణికి కొంచెం మనశ్శాంతి లభించింది.

ఝాన్సీ చదువుకుని ఉద్యోగంలో చేరాక, డబ్బు సంపాదించడం వల్ల ఎన్ని హక్కులు పొందవచ్చో కూడా కృష్ణవేణికి తెలిసింది.

కానీ డబ్బు సంపాదిస్తూకూడా స్త్రీ లక్షణాలూ,పతిభక్తీ వగైరాలన్నీ నిలుపుకోవల్సిన అవసరాన్ని గిరీశం ఎంతగా ప్రచారం చేస్తున్నాడో ఆమె గమనిస్తూనే వుంది.స్త్రీల ఆర్థిక స్వతంత్రంమీద అతను ఉపన్యాసాలిస్తాడు. చదువుకోవాలంటాడు. కానీ పురుషుల మాట శిరోధార్యమంటాడు.అక్కడే అతనికీ ఝాన్సీకి పడదు.

నా శరీరం, నా మనస్సు, నా ఆలోచన, నా స్పందన- నా అనుభూతి- ఇవన్నీ నా స్వంతం అంటుంది.నా బతుకు తీర్చిదిద్దుకునే స్వతంత్రం,స్వేచ్ఛ నావి అంటుంది. అట్లా పెరిగి పెద్దదైన ఝాన్సీ కృష్ణవేణిని తీసుకువెళ్ళి డాక్టర్ చేత మెడమీద మేకు తీయించివేసింది. అక్కడ అప్పుడైనా గాయానికి తన వెచ్చని చేతులతో లేపనాలు పూసి నయం చేసింది. కృష్ణవేణి స్వేచ్ఛగా తల ఎత్తేలా చేసింది.

పుస్తకాలు, స్నేహితులు,లైబ్రరీలు, చర్చలు, సెమినార్లు, సభలు- సమావేశాలు, ఉద్యమాలే జీవితంగా ఎంచిన ఝాన్సీలక్ష్మిచేతిలో హాయిగా సంతృప్తిగా కళ్ళుమూసింది కృష్ణవేణి.

ఝాన్సీలక్ష్మి తన కూతురు గీతకి తను సాధించిన విజయాల ఫలితాలన్నీ అందుతాయనీ- ఆమెకి ఆకాశమే హద్దనీ, ఒక గీత వంద గీతల్ని తయారుచేస్తుందనీ, మరింక మరుగుజ్జులూ, మెడ మీద మేకులు కొట్టించుకునేవాళ్ళూ వుండరనీ, అందరూ అన్నీ తెలుసుకుంటారనీ, అందరూ ఆలోచిస్తారనీ- ప్రశ్నిస్తారనీ, ఉద్యమిస్తారనీ ఆశపడింది.

తనతరంలో ఎన్ని స్త్రీ ఉద్యమాలు! ఎన్ని సుఖనైవేద్యాలు? ఇంక ఇప్పుడా అవసరం ఉండకపోవచ్చు. గీతలంతా నడుం కడితే వరకట్నాలుండవు. దౌర్జన్యాలుండవు. అత్యాచారాలుండవు. రాబోయే కాలం వాళ్ళది అనుకుంటోంది.

సరిగ్గా అప్పుడే ఊళ్ళోకి ఒకతను వచ్చాడు. పాల రాతి శిల్పంలా వున్నాడు.మెరిసే నీలికళ్ళతో నవ్వుతూ వచ్చి రచ్చబండ మీద కూర్చున్నాడు.

అప్పటికే ఊరు మారింది. ఇళ్ళకి కిటికీలొచ్చాయి. ఇంటిపైన యాంటెనాలొచ్చాయి. రచ్చబండ చుట్టూ మేడలు మిద్దెలొచ్చాయి. నీళ్ళురాని పంపులొచ్చాయి. ఎద్దులు పోయి *(తారువాయి 38వ పేజీలో)*

వంపుతుండేవారు. ఇంటర్నెట్‌తో సమాచార రంగంలో వచ్చిన విప్లవాత్మకమైన మార్పు గ్రాఫాలజీలో నా అధ్యయనానికి యెంతో వుపకరించింది.

*** ***

1997వ సంవత్సరంలో జరిగిన వొక సంగతి. నా స్నేహితుని బంధువులమ్మాయికి పెళ్ళంటే భయం వుండేది. ఆమెను న్యూరో సైక్రియాటిస్ట్‌కి చూపించాలని వాళ్ళు నిర్ణయించారు. ఆ సందర్భంలో నేను ఆమె రాసుకున్న నోట్సులు చదివాను. రాత ఆధారంగా ఆమె స్వభావంలో భయచిహ్నాలను గుర్తించగలిగాను. ఆమె ఒంటరితనంతో బాధపడుతున్నట్టు భావించాను. అందుకే ఆమెకి పెళ్ళంటే విముఖత. తనను యెవరైనా అపరిచితుడు తాకితే భరించగలిగే మానసిక స్థితి ఆమెకు లేదు. ఆమెను న్యూరో సైక్రియాటిస్ట్‌కి చూపించే ముందు నేను ఆయనతో మాట్లాడి నా అబ్జర్వేషన్స్ చెప్పాను. మొదట నమ్మలేదు. ఆమెతో మాట్లాడిన తర్వాత ఆశ్చర్యపోయాడు. ఎందుకంటే నేను చెప్పిన సంగతులు రుజువయ్యాయి. ఆమె చిన్నతనంలోనే తల్లి చనిపోయింది. ఆ యింట్లో మరొక మహిళ లేదు. ఒంటరిగా పెరిగింది. పెళ్ళిపట్ల విముఖతకి అదీ కారణం!

న్యూరో సైక్రియాటిస్ట్ నన్ను అభినందించడమే కాక ప్రోత్సహించారు. ఆమె మానసిక స్థితిని గ్రాఫో థెరపి ద్వారా ప్రభావితం చేయవచ్చునా అని అడిగారు. చేయవచ్చునన్నాను. మూడు నెలలపాటు చేతి రాతకి సంబంధించి ఆమెకి తర్ఫీదు యిచ్చాను. దీనితోపాటు కౌన్సిలింగ్ కూడా. మానసిక పరిపుష్టిని సంతరించుకోడానికి ఆమెకీ సమయం సరిపోయింది. అనంతరం ఆమె పెళ్ళి సజావుగా జరిగిపోయింది. ఈ కేసు గ్రాఫో థెరపీ ద్వారా సాధించిన విజయంగా భావిస్తాను.

*** ***

తదనంతర కాలంలో గ్రాఫాలజీ గురించి నా ఆసక్తి మరింత పెరిగింది. ఎమ్మే సోషియాలజీ పూర్తిచేశాను. గ్రాఫో థెరపీ గురించి పరిశోధన చేశాను. 'హేండ్ రైటింగ్ అండ్ హెల్త్' అనే అంశంపై నేను సమర్పించిన పరిశోధన గ్రంథానికి 2001 సెప్టెంబర్‌లో కోల్‌కతాకి చెందిన ఇండియన్ బోర్డ్ ఆఫ్ ఆల్టర్నేటివ్ మెడిసిన్స్ వారు డాక్టరేట్‌ని ప్రకటించారు. ప్రస్తుతం సికింద్రాబాద్‌లో యాడ్‌కాం అనే సంస్థని ప్రారంభించాను. నా లక్ష్యం గ్రాఫో థెరపీలో మరిన్ని విజయాలు సాధించాలనేదే. చిన్నపిల్లల చేతి రాతని పరిశీలించి వారికి యే సబ్జెక్టులో ఆసక్తి వుందో కనుక్కోవచ్చు. అలా చేయడం ద్వారా వారిని చిన్నతనం నుంచే ఆయా రంగాల్లో నిష్ణాతుల్ని చేసే ప్రయత్నాలు చేపట్టవచ్చు. అదేవిధంగా హేండ్ రైటింగ్ క్లినిక్ పెట్టి చేతి రాత ద్వారా చిన్నపిల్లల్లో జ్ఞాపకశక్తిని పెంచే ప్రక్రియని ప్రచారంలోకి తేవాలనుంది. 'హేండ్ రైటింగ్ టాక్స్' శీర్షికతో ఇంగ్లీషులో వొక పుస్తకాన్ని విడుదలచేశాను. పిల్లల కోసం త్వరలోనే మరో పుస్తకాన్ని ప్రచురించబోతున్నాను.

**- రమేష్**

# మంత్రనగరి

*(19వ పేజీ తారువాయి)*

ట్రాక్టర్లొచ్చాయి.

ఆ నీలి కళ్ళ తెల్లమనిషిని చూసి ఎవరూ అతని చుట్టూ మూగలేదు. ఎవరి గొడవలో వాళ్ళున్నారు. అతని భుజానికి మెడ వంగిపోయేంత బరువున్న సంచీ ఒకటుంది. దాన్ని దించి కిందపెట్టి, అందులోంచి ఒక విచిత్రమైన వాద్యం తీసి వాయించడం మొదలుపెట్టాడు. సంగీతం మేడలకుండా, పెంకుటిళ్ళకుండా, పూరిళ్ళమధ్యగా, కాలవ గట్టుమీదుగా, పొలాలపైకి పాకింది.

మొదట సంగీత అక్కడికొచ్చింది. తరువాత గీత వచ్చింది. వందన వచ్చింది. విద్య వచ్చింది. అమ్మాయిలంతా వచ్చారు.

అతను అందరికీ అభివాదం చేశాడు. మెత్తగా నవ్వాడు.

"ఏం చేస్తూ వుంటావమ్మా నువ్వు" అన్నాడు గీతతో.

"అమ్మాయిలకి ఎట్లా జీవించాలో చెబుతున్నాను. జీవన నాణ్యత గురించి పాఠం తయారుచేస్తున్నాను" అంది.

"ఎవరి సలహాతో చేస్తున్నావమ్మా?"

"మా అమ్మ ఝాన్సీలక్ష్మి నా ఆదర్శం"

"మీ అమ్మ ఏం సాధించింది-మేడ కట్టిందా? కారు కొనుక్కుందా? కష్టపడకుండా పనిచేసిపెట్టే పరికరాలన్నీ కొనుక్కోగలిగిందా? ఎప్పుడూ కష్టమేగదా! ఎప్పుడూ తడుములాటేకదా! కోరుకున్న తిండి, సౌకర్యవంతమైన ఇల్లు-కావల్సినంత విశ్రాంతి ఇవ్వన్నీ వుంటేనే బతుకులో నాణ్యత" చాలా నమ్మకమైన గొంతుతో అంటున్నాడు.

"స్వతంత్రంగా బతకడం, ఆత్మవిశ్వాసంతో బతకడం- ఆత్మగౌరవం నిలబెట్టుకోవడం- ప్రేమించగలగడం-త్యాగం చేయగలగడం, పోరాడగలగడం ఇవ్వే నాణ్యమైన జీవితానికి అవసరమైన గుణాలని మేంఅనుకుంటున్నాం"-



అతను భుజాలు ఎగురవేస్తూ, నీలికళ్ళు మెరిపిస్తూ నవ్వాడు.

"భౌతిక సుఖాలు లేనిదే మనశ్శాంతి వుండదు. మనశ్శాంతి లేని వ్యక్తి ఎవరికీ ఏమీ సహాయం చేయలేడు. సరే ఈ రోజుకి మన చర్చ ఆపుదాం. దయచేసి నేను తెచ్చిన ఈ వస్తువులని కాదనకుండా స్వీకరించి నన్ను సంతోషపెట్టండి. ప్లీజ్. డోన్ట్ సే నో" అని అర్థించాడు. వందన స్వీకరించింది. సంగీత స్వీకరించింది. గీత కూడా. ఆఖరికి అమ్మాయిలంతా ఆ బహుమతుల్ని స్వీకరించారు.

అందమైన, ఖరీదైన, ఉపయోగకరమైన బహుమతులు. సంగీత అతన్ని తన ఇంటికి పిలిచింది- వందన డిన్నర్‌కి ఆహ్వానించింది. రెండోరోజు అతను మళ్ళీ మొదలుపెట్టాడు.

"అమ్మాయిలకి అందం ముఖ్యం-ఆలంబన ముఖ్యం-కుటుంబం ముఖ్యం-గృహమే స్వర్గసీమ-మీరేం చదివినా, ఎంత సంపాదించినా మీకందరికీ మీకన్న అన్నింట్లో అధికుడయిన భర్త ముఖ్యం-ఇది యుగయుగాల సత్యం-మీరు సంపాదించండి-కొనుక్కోండి-అనుభవించండి-అందంగా వుండండి-అందంగా వుంటే ఆత్మ విశ్వాసం పెరుగుతుంది. మీ అందం కోసం నేను చాలా సాధనాలు తయారు చేశాను. అవ్వన్నీ కొనుక్కోండి"-

"బావుంది సార్- నీలికళ్ళసార్- తిండిలేక చాలామంది అల్లాడుతుంటే-బోలెడన్ని అసమానతలు-అత్యాచారాలు-దౌర్జన్యాలు జరుగుతుంటే-ఈ సౌందర్య లేపనాలు సాధనాలు ఎంతమందికి కావాలి? మాబాగా చెప్పారు-"అంది గీత.

"అక్కడే తప్పు చేస్తున్నవమ్మా నువ్వు-అందరి సంగతి నీకెందుకు! నీ సంగతి చూసుకో ముందు-వ్యక్తులంతా ఎవర్ని వాళ్ళు బాగుచేసుకుంటే అంతా బాగయిపోతుంది-"

"అందరికీ అట్లాంటి అవకాశం లేదు కదా సార్!"

"ఉన్నవాళ్ళే పైకొస్తారు-లేనివాళ్ళు పోతారు-అదే సర్వైవల్ ఆఫ్ ది ఫిట్టెస్ట్ సూత్రం-చదివే వుంటావు కదా!"

"అంటే ఎవరిమటుకు వాళ్ళు సంపాదించుకుని, అందంగా తయారైపోతే సరిపోతుందా!" అంది గీత కాస్త ఆవేశంతో.

"అంతదాకా ఎందుకు-నేను మీకిచ్చిన వస్తువులు మీకు నచ్చాయా లేదా? ఉపయోగపడుతున్నయా లేదా? మరి అవ్వన్నీ కొనుక్కోవాలని మీకుందా లేదా? కొనుక్కోవాలంటే కష్టపడాలా వద్దా? అసలు ఈ ప్రపంచాన్నంతా ఒకచోటికి చేర్చింది మనీ పవరే కదా! దాన్ని మనం గౌరవించాలి-మనని మనం గౌరవించుకుని మనకోసం మనం కష్టపడాలి-'నేను' అనే బిందువు చుట్టూనే సకల ప్రపంచం పరిభ్రమిస్తుందని నీఅంత తెలివిగలదానికి నేను చెప్పాలా? నువ్వే ముఖ్యం-నువ్వే సర్వం-నువ్వే విశ్వం-ఆపెయ్ నీ అలజడులు-ఆవేశాలు-ఉద్యమాలు" ఇట్లాసాగింది ప్రవచనం-అమ్మాయిలు మరి మాట్లాడలేకుండా మూగబోయేంత వరకూ.

అతని సంచీలో నుంచీ మరిన్ని అద్భుతమైన సరుకులు తీసిచ్చాడు. శారీరక శ్రమ తగ్గించేవి. సౌందర్యాన్ని పెంచేవి.

"మనకి శ్రమని తగ్గించేవి-సమయాన్ని మిగిల్చేవి అయిన ఈ వస్తువులు కొనుక్కుంటాం గదా! ఆ మిగిలిన సమయంలో పోనీ మన కన్న కాస్త తక్కువ అదృష్టవంతుల విషయం ఆలోచించనచ్చేమో-"అంది వందన

"బావుంది! నీ తీరిక నీ యిష్టం-అది నీ విశ్రాంతి కోసం-అందుకోసం ఈ పెట్టె యిస్తున్నాను. ఇందులో నుంచీ వచ్చే వందలాది ధారా వాహికలు చూడు. మెదడుకి ఎక్కువ పని కల్పించకు-అలసిపోతావు-అసలు నీకు మెదడుతో ఏంపని? రోజువారీ పన్లు యాంత్రికంగా చేసుకుంటూ పో! అందుకే నీకీ యంత్రాలు-తరువాత విశ్రాంతి తీసుకో! నీకు ఆలోచించి పెట్టడానికి నేను లేనా! మీరంతా నా మేన కోడళ్ళు-నేను చెప్పినట్లు వినండి-"

అమ్మాయిల బుర్రలు గిర్రున తిరిగిపోతున్నాయి. "ఝాన్సీలక్ష్మిని మెంటల్ హాస్పిటల్లో చేర్పించాలి' అనేసింది కూడా ఒకమ్మాయి.

"వాళ్ళ నాన్న వాళ్ళమ్మ మెడ మీద మేకు కొట్టాడని అందరూ అలా వుంటారా! మానాన్న చాలా మంచివాడు-నాకు బోలెడు నగలు చేయించాడు" అంది ఇంకో అమ్మాయి.

"అవును- సమస్యల్ని గురించి మనమెందుకు పట్టించుకోవాలి? అందుకు రాజకీయ నాయకులున్నారు. మనం ఏం చెయ్యలేం-రాజకీయాల్తో మనకేం పన్లేదు-అవి జీవితంలో భాగం కాదు- అవి చూసుకోడానికి వేరే వాళ్ళున్నారు. కాలంమారింది. మనమూ మారాలి- ఇతనే మన గురువు- స్నేహితుడు-"

అతనొచ్చిన పనైపోయింది. సంచీ దులిపి భుజాన తగిలించుకున్నాడు. మంత్రవాద్యం తీసి మళ్ళీ వాయించడం మొదలుపెట్టాడు. అట్లా వాయిస్తూ వెడుతున్నాడు. మేడల్లో నుంచీ, పెంకుటిళ్ళల్లో నుంచీ, పూరిళ్ళనుంచీ కూడా అమ్మాయిలు పరిగెత్తుకొస్తున్నారు. పైడ్ పైపర్ వెంటపడిన ఎలకల్లాగ.

"వస్తున్నారా మీరంతా నాతోపాటు మా మంత్రనగరికి?" అన్నాడు మెరిసే కళ్ళతో.

"వస్తాం-కానీ మళ్ళీ తిరిగి రాలేకపోతే-మా వూరు తలుచుకుని దిగులువడితే ఎలా మాకు? దు:ఖం రాదా! ఈ పొలాలు-ఈ వనాలు-మా అమ్మ-"

"దానిదేం వుంది-అన్ని భయాలనూ-దిగుళ్ళనూ-అభద్రతా భావాలనూ మరిపించేది మతం-హాయిగా వ్రతాలు చేసుకోండి-పూజలు చేసుకోండి. మీవూరి వంటలు వండుకు తినండి-గుళ్ళూ గోపురాలు కట్టుకోండి-"అని వెనక్కి తిరిగి చూడకుండా సాగిపోతున్నాడు. అమ్మాయిలు పరిగెత్తుతున్నారు. పూల మొక్కలు తొక్కుకుంటూ-అనసూయ సమాధి మీద నుంచీ, కృష్ణవేణి సమాధి మీద నుంచీ, బిత్తరపోయి చూస్తున్న ఝాన్సీలక్ష్మి కళ్ళ ముందు నించీ-

కథ కెంటకీ ఫ్రైడ్ చికెన్‌కి, మనం ఎక్కడికో తెలీదు.